# నిజంలోని నిజం

## డా. వాసిరెడ్డి సీతాదేవి

ఖైరతాబాద్ సిటీ క్రైంబ్రాంచి ఆఫీసు.

ఇన్స్పెక్టర్ జగన్నాథం కుర్చీలో వెనక్కు చేరబడి కూర్చున్నాడు. ఫైల్సు తిరగేస్తూ తను ఎంతమందిచేత తమ తప్పుల్ని ఒప్పించాడో మననం చేసుకుంటు న్నాడు.

ఎన్నో పేర్లు.

రకరకాల అపరాధాలు.

తన చేతిలోని కొరడా ఎందరిచేతనో అపరాధం చేసినట్లు ఒప్పించింది. దానికి ఎందరి చర్మమో అతుక్కుపోయింది.

అది తనకు గోల్డ్‌మెడల్ కూడా ఇప్పించింది. తనకు అనతికాలంలో ప్రమోషన్ కూడా ఇప్పించింది. తన సీనియర్స్ ఎందరో ఇంకా సబ్ ఇన్స్పెక్టర్లుగానే ఉన్నారు.

గడియారం చూసుకున్నాడు. రాత్రి పది దాటింది. డైరీ సొరుగులో పెట్టాడు. తాళం వేసాడు. పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ బయటకి వచ్చాడు. జీప్ ఎక్కి కూర్చున్నాడు. జీప్ పరుగుతీస్తోంది. రాజు జీపు ముందు పరుగెడుతున్నాడు. కళ్లు మూసుకుని తెరిచాడు. మరో రూపం. ఏమిటిది? కొద్దిరోజులుగా తనకు ఇలా జీపు ముందు పరుగెత్తుతున్నట్లు ఎవరెవరివో రూపాలు కనిపిస్తున్నాయి.

రాజు నిజంగా అపరాధం చేసాడా? చెయ్యలేదేమో? ఛీ! ఏమిటి తను ఇలా ఆలోచిస్తున్నాడు. అదంతా తనకు అనవసరం. అపరాధం చేసానని అంగీకరించాడు. అంతే!

జీపు ఇంటిముందు ఆగింది.

ఆర్డర్లీ లేచి సలాం కొట్టాడు.

ఇన్స్పెక్టర్ జగన్నాథం తన గదిలో తలుపులు మూసి గడియపెట్టాడు.

బట్టలు మార్చుకుని మంచంమీద కూర్చుని సిగరెట్ వెలిగించుకున్నాడు.

ఉన్నట్టుండి వళ్లు జలదరించింది.

వేళ్లమధ్య సిగరెట్ కిందపడింది.

దిగ్గున మంచం దిగాడు.

నాసికాపుటాలను ఎగరేసాడు.

ఏదో వాసన!

రక్తపు వాసన!

కాదు కాదు చమట వాసన!

ఎవరిదీ వాసన? తన గదిలో ఇంకెవరో వున్నారు.

జగన్నాథం వంగి మంచం కింద చూసాడు. గదంతా కలియచూసాడు. ఎవరూ కనిపించలేదు. ఎవరూలేరు. అంతా తన భ్రమ!

మరి ఈ వాసన?

గదిలో అటూ ఇటూ తిరుగుతున్న అతనికి తన వెనకే ఎవరో అడుగులో అడుగు వేసుకుంటూ తిరుగుతున్నట్లుగా తోచింది. జగన్నాథం ఠక్కున ఆగాడు. అతడూ ఆగాడు. జగన్నాథం గిర్రున తిరిగాడు. అతడు కూడా గిర్రున తిరిగి తన వెనకే నిల్చున్నట్లుగా గ్రహించాడు. గాలి కుంభించి మెడ నుంచి వెనక్కి చూసాడు. ఎవరూ కనిపించలేదు. బిగించి గాలి వదిలాడు. రిలీఫ్‌గా మళ్లీ గాలి పీల్చుకున్నాడు.

రేడియో ఆన్ చేసాడు.

సోఫాలో జారిగిలపడి తెలుగుపాట వింటున్నాడు.

మళ్లీ అదే వాసన! వాడే వాడే. తన వెనక సోఫా వెనుక నిల్చుని వాడూ పాట వింటున్నాడు.

''రాస్కెల్ ఎన్ని గుండెలురా నీకు? నా గదిలోకే వచ్చి నా వెనకాలే తిరుగుతావురా?'' సర్రున లేచాడు. వాడు అందినట్టే అంది తప్పుకుపోతున్నాడు.

''నాలోని నువ్వు నీలోని నేను నువ్వు నేనయితే నేనే నువ్వయితే హాయి హాయి మధురం మధురం ఈ జీవితం. నిజం. నిజమే అబద్ధం. అబద్ధంలో నిజం. నిజంలో నిజం''

జగన్నాథం ఒక్క దూకున వెళ్లి ఆ కంఠం నొక్కేసాడు. రేడియో గోడకు కొట్టుకుంది.

పకపకా నవ్వు.

స్కౌండల్ ఎందుకురా నవ్వుతావు?

గిర్రున తిరిగి వాడి మీదకు దూకాడు. కానీ వాడు తప్పుకున్నాడు. స్విచ్ బోర్డు తగిలి జగన్నాథం ముఖం బొప్పి కట్టింది. నుదురును అరచేతితో రాసుకుంటూ సోఫాలో కూలిపోయాడు.

ఛ! ఛ! తనేం చేస్తున్నాడు?

అసలిక్కడ ఎవడూ లేడే? అసలు లోపలకు ఎలా వస్తాడు? తను తలుపులు వేసాడుగా? గడియ కూడా పెట్టాడాయె? తను రాగానే ఆర్డర్లీ తనముందే తాళం తీసాడు. జగన్నాథం తలుపులకేసి చూసాడు. మూసే వున్నాయి. గడియ కూడా వేసే వుంది.

ఇంపాజిబుల్!

ఇటీజ్ పాజిబుల్!

తన వెనకే జొరబడి వుంటాడు.

యస్! యస్! వాడే! ఆ స్నీకీ రాస్కెల్. అదే చెమట వాసన. చివ్వున తలెత్తి చూసాడు.

''ఎవరు నువ్వు?''

ఎంత ధైర్యం వీడికి? తనకెదురుగా రొమ్ము విరుచుకుని నిలబడ్డాడు.

''మాట్లాడవేం?''

మాట్లాడడేం?

'యూ డర్టీ...'' పళ్లు కొరుకుతూ లేచి గోడకు తగిలించి వున్న హంటర్ కసిగా లాగాడు.

ఛెళ్! ఛెళ్!

బలంకొద్దీ హంటర్ విసురుతున్నాడు.

అయినా వాడిలో ప్రతిక్రియ కనిపించడంలేదు.

జగన్నాథం అలసిపోతున్నాడు.

ఓడిపోతున్నాడు.

వాడి నోటివెంట ఒక్క మాట కక్కించలేక పోతున్నాడు. కనీసం కళ్లవెంట నీరైనా పెట్టించలేక పోతున్నాడు.

జగన్నాథం హంటర్ నేలకేసి కొట్టాడు.

మంచంమీద కూలబడి సిగరెట్ ముట్టించాడు.

గట్టిగా పొగ పీల్చి వదులుతూ అతడికేసి ఓరగా చూసాడు. బెరుకు బెరుగ్గా చూసాడు. అతని లోపలి నుంచి ఏదో తెలియని భయం తన్నుకొస్తూంది.

ఛా! ఏమిటిది? తనకా భయం?

మళ్లీ వాడికేసి చూసాడు. ఈసారి వాడి కళ్లల్లో నీటిపొరలు కనిపించాయి.

వాడు ఏడుస్తున్నాడు.

మరికొద్ది క్షణాల్లో బావురుమంటాడు. తన కాళ్లమీద పడ్తాడు.

''రాస్కెల్ అలారారా దారికి!'' గర్వంగా దర్పంగా వాడి ముఖంలోకి చూసాడు. ఝల్లిపడ్డాడు.

ఆ కళ్లు నిప్పులు కక్కుతున్నాయి. బడబాగ్ని అంటే ఇదేనేమో?

ఆ ముఖంలో ఎంతమాత్రం బెదురులేదు. బాధలేదు. బద్దలవడానికి సిద్ధంగా వున్న అగ్నిపర్వతం లా వున్నాడు. ముఖంలో, కళ్లల్లో ఎలాంటి బాధాలేదు. మొండితనం వుంది.

రచయిత్రి సాహితీ స్వర్ణోత్సవ సందర్భంగా

''ఒరేయ్! నువ్వు మొండివయితే నేను జగమొండినిరా! నీ చేత నిజం కక్కించగలనురా'' అరిచాడు జగన్నాధం.

వాడిలో ఏమాత్రం చలనంలేదు.

జగన్నాధం చేతిలోని సిగరెట్‌ను ఓ మూలకు విసిరాడు. ఏం చేయాలో తోచక గదిలో అల్లీబిల్లీగా తిరిగాడు. నేలమీదున్న కొరడాను చూసాడు. దాని చుట్టూ వున్న తోలు ఊడిపోయి వుంది.

చిత్రం! ఎంతమంది తోలో వొలిచిన ఈ కొరడా తోలు వీడు వొలిచేసాడు.

ఆర్డర్లీని పిలిస్తే?

తలుపువరకూ వెళ్లి ఆగిపోయాడు జగన్నాధం.

నో! నో! తానే వీడ్ని లొంగదీసుకోవాలి. ఎవడో కొడ్తున్నప్పుడు విన్పించే హాహాకారాలను తను భరించలేడు. అంతసేపూ తన గుండెల్ని ఎవరో పిండివేసున్నట్టుగా వుంటుంది. పోలీసాఫీసర్‌కు వుండ కూడని బలహీనత తనలో వుంది.

కానీ స్వయంగా కుమ్ముతుంటే విన్పించే హాహాకారాలు తన చెవులకు ఘంటసాల పాట వింటు న్నట్లుగా వుంటుంది. అందుకే తనే వీడ్ని లొంగ దీయాలి. వాడిచేత తనే నిజం చెప్పి కాదు... కక్కిస్తాడు.

జగన్నాధం కిందకు వంగి హంటర్ అందుకోబోయి తూలి మంచంమీద పడ్డాడు. మంచం మీద నుంచి ఎక్కడికో లోతులు తెలియని అగాధంలోకి పడిపోతున్నాడు. కాదు... కాదు తన లోపలికే...లోలోపలికి దిగబడిపోతున్నాడు.

పసివాడి ఏడుపు దూరం నుంచి చిన్నగా విన్పిస్తూ క్షణం క్షణం దగ్గర అవుతోంది. బిగ్గరగా చెవులు చిల్లులు పడేలా వినిపిస్తోంది.

అరే ఆ గొంతు తనదే!

తనే ఏడుస్తున్నాడు.

తను తప్పు చేయలేదు. నాన్న కొడుతున్నాడు తనను. తప్పు ఒప్పుకోమని కొడ్తున్నాడు. తను మొండికేసి నిల్చున్నాడు. తన వంటిమీద కొరడా నాట్యం చేస్తోంది.

''బాబూ! నాన్నా! ఒప్పుకోరా కన్నా! నేను ఈ హింసను చూడలేన్రా. నువ్వు తియ్యకపోయినా తీసానని ఒప్పుకోరా నాన్నా'' అమ్మ గోడుగోడున ఏడుస్తోంది.

అమ్మ ఏడుపు వినలేకపోయాడు. అమ్మ అనుభవిస్తున్న బాధ చూడలేకపోయాడు. అందుకే తను చెయ్యని తప్పును చేసినట్లు ఒప్పుకున్నాడు. ఆ రోజు నాన్న జేబులోనుంచి వందరూపాయల నోటు ఎవరో...ఎవరో ఏమిటి అన్నయ్యే తీసాడు.

తను అంతకుముందు ఎన్నోసార్లు నాన్న జేబులోనుంచి రూపాయి, అర్ధా తీసాడు. నాన్న ఎంత కొట్టినా వళ్లప్పగించాడేగానీ తప్పు ఒప్పుకోలేదు. నాన్న కూడా రెండు మూడు దెబ్బలు కొట్టి వదిలేసేవాడు. పన్నెండేళ్లు నిండని తను ఒక్కసారే వందరూపాయలు దొంగిలించాడన్న భావం నాన్నను పిచ్చివాడ్నే చేసింది.

తన తండ్రి చండశాసనుడు. పిల్లల్ని డిసిప్లైన్‌తో పెంచాలన్న నమ్మకం గలవాడు.

ఎన్నోసార్లు తను తండ్రిచేత కొరడా దెబ్బలు తిన్నాడు. మొండిగా నిల్చుండిపోయాడు. కంటి వెంట నీరు కూడా వచ్చేదికాదు.

ఆ రోజు-ఆ రోజు కూడా వళ్లంతా చిట్లి రక్తం కారుతున్నా తను మొండిగానే నిల్చున్నాడు. తన మొండితనం తన తండ్రిని మరీ రెచ్చగొట్టింది.

చివరకు తన తల్లి బాధ చూడలేక నిజం...కాదు కాదు అబద్ధంలో నుంచి నిజం -కాదు నిజంలోని అబద్ధం- దాన్ని ఏమనాలో తనకు బోధపడడంలేదు. అది నిజంలోని నిజం మాత్రం కాదు. తను చెయ్యని తప్పును చేసినట్లు అంగీకరించాడు.

అప్పుడు చూడాలి తన నాన్న ముఖం!

చేతిలోని కొరడా అవతల పారేసి సంతృప్తిగా నిట్టూర్చాడు.

ఆ ముఖంలో సంతోషం. ఆ కళ్లల్లో గర్వం!

అంతవరకూ ఏడుపు రాని తనకు నాన్న ముఖం చూసి ఏడుపు తన్నుకొచ్చింది. పెద్దగా ఏడ్చాడు.

తనలో ఏదో కసి ఆ రోజునుంచే పెరగసాగింది. పెరిగి...పెరిగి...

జగన్నాధం త్రుళ్లిపడ్డాడు. లోపలకు... లోలోపలకు దిగజారిపోయిన జగన్నాధం బయటకు వాడు-ఇంకా అలాగే ఎదురుగా నిలబడి తన కళ్లల్లోకి చూస్తున్నాడు. ఆ కళ్లల్లో ఎంత సంతృప్తి... హంటర్ చేతిలోకి తీసుకున్నాడు.

ఛెళ్...ఛెళ్...ఛెళ్...!

అప్పటికి ఇద్దరు ఆర్డర్లీలూ, వంటవాడు గది ముందుకొచ్చి నిలబడ్డారు. ఊపిరి బిగబట్టి చెవులు రిక్కించి నిల్చున్నారు.

ఒక్కసారిగా హంటర్ శబ్దం ఆగిపోయింది.

ఏదో దబ్బుమని కిందపడ్డ శబ్దం-ఆ శబ్దం వెన్నంటి పెద్ద మూలుగు గోడ బయటకు విన్పించాయి.


''సాబ్! సాబ్'' గాభరాగా తలుపుమీద బాదసాగారు ఆర్డర్లీలు. జీప్ డ్రైవర్, ఇరుగుపొరుగువాళ్లు చేరారు.

చివరకు తలుపులు బద్దలుకొట్టారు. గదిలోకి చూసిన ప్రతి ఒక్కడూ అవాక్కయి శిలా ప్రతిమల్లా నిలబడిపోయారు.

జగన్నాధం నిలువెత్తు శరీరం గదిలో అడ్డంగా పడి ఉంది.

శరీరమంతా చిట్లి రక్తం చిమ్ముతోంది.

అతని కుడిచేతి గుప్పెట్లో హంటర్ హేండిల్ అలాగే వుంది. ★



జగన్నాధం అలసిపోతున్నాడు.
ఓడిపోతున్నాడు.
వాడి నోటివెంట ఒక్క మాట కక్కించలేక పోతున్నాడు. కనీసం కళ్లవెంట నీరైనా పెట్టించలేక పోతున్నాడు.
జగన్నాధం హంటర్ నేలకేసి కొట్టాడు.
మంచంమీద కూలబడి సిగరెట్ ముట్టించాడు.